జిల్లాలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఆయా ఆలయాల్లో నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పదిరోజులు దసరా సెలవులు రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఆనందంగా పండుగలో గడిపారు. విజయదశమి రోజున బాణాసంచా పేలుళ్లు, విచిత్ర వేషధారణలు, కేరళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ముఖ్యంగా రెండవ మైసూరుగా పేరొందిన ప్రొద్దుటూరు, కడప నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరిగాయి.

- ప్రొద్దుటూరుటౌన్/కడప కల్చరల్





వైభవం.. దసరా ఉత్సవం



- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు
- ఆకట్టుకున్న బాణాసంచా పేలుళ్లు, వేషధారణలు


రాయచోటిలో అమ్మవారి గ్రామోత్సవం

ప్రొద్దుటూరులో..

దసరా ఉత్సవాలు మైసూరు తర్వాత అత్యంత వైభవంగా జరిగేది ప్రొద్దుటూరులోనే. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఈ వేడుకలు చూసేందుకు లక్షల మంది ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారి శమీ దర్శన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. విజయానికి, సిరిసంపదలకు, శుభాలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించుకుని పూజలు చేస్తే శుభప్రదమని ప్రతీక. దీంతో అమ్మవారిశాల, శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, చౌడేశ్వరీదేవి ఆలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయ నిర్వాహకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శమీ దర్శనానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కేరళ సింగారి మేళం, సినీకళాకారుల డూప్స్, శక్తి వేషధారణలు, హర్యానా కళాకారుల భంభం భోలే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శమీ దర్శనం, తొట్టి మెరువణిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులతో ప్రొద్దుటూరు పుర వీధులు జనసంద్రంగా మారాయి.

ఉర్రూతలూగించిన సినీ హీరోల డూప్స్

ఉత్సవాల సందర్భంగా సినీ హీరోల డూప్స్ యువతను ఉర్రూతలూగించింది. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ, చిరంజీవి, పవన్‌కళ్యాణ్, నాగార్జున తదితర సినీహీరోల డూప్స్ అభిమానులు అడిగిన పాటకు డ్యాన్స్‌లు వేస్తూ.. డైలాగ్స్ చెబుతూ అందరిలో ఉత్సాహం నింపారు. అనంతరం శివాలయం సెంటర్‌లో తెల్లవారుజామున దాదాపు గంటపాటు పేల్చిన టపాసులు చూపరులను ఆకట్టుకుంది.



కడప జిల్లా ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో అమ్మవారి గ్రామోత్సవానికి హాజరైన భక్తజనం

కడప నగరంలో..

శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో వైభవోపేతంగా ముగిశాయి. మొదటి రోజు నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ముగింపు సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి శమీ వృక్ష దర్శనం చేయించారు. మిరమిట్లు గొలిపే బాణాసంచా కాంతులు, కళాకారుల నృత్యాలు, విచిత్ర వేషధారణలు గుర్రాలు, వృషభరాజములు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కడప నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, విజయదుర్గాదేవి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, గడ్డి బజారులోని సత్యనారాయణ స్వామి ఆలయంలో కళాకారుల ప్రదర్శనలు, బాణాసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రాయచోటిలో వైభవంగా గ్రామోత్సవం

రాయచోటిటౌన్, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల ఉమామహేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు నటరాజ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని పుష్పపల్లకీలో రాయచోటి పట్టణ పురవీధుల్లో వైభవంగా పల్లకీ ఉత్సవ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలు, నగలతో అత్యంత అద్భుతంగా పుష్పాలంకరణ చేసి నెల్లూరు నగరానికి చెందిన సాంస్కృతిక కార్యక్రమాల బృందంచే గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవం కార్యక్రమం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల చెక్‌పోస్టు శివాలయం నుంచి బయలుదేరి ఎస్ఎన్ కాలనీ, నేతాజీ సర్కిల్ కూడలి, బస్టాండు సర్కిల్, జగదాంబసెంటర్, కొత్తపేట, మదనపల్లె రోడ్డు మీదుగా తిరిగి దేవస్థానం చేరింది. ఈ సందర్భంగా పట్టణ భక్తజనం ఉమామహేశ్వరి అమ్మవారి గ్రామోత్సవాన్ని తిలకించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి గ్రామోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



రాయచోటిలో పల్లకి ఉత్సవంలో ఊరేగుతున్న ఉమామహేశ్వరిదేవి అమ్మవారు



రాజంపేటలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజంపేటలో ముగిసిన దసరా ఉత్సవాలు

రాజంపేట టౌన్, అక్టోబరు 13: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో శనివారం ఘనంగా ముగిశాయి. రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. విజయదశమి సందర్భంగా అమ్మవారిశాల కన్యకాపరమేశ్వరిదేవి, రెడ్డివారివీధిలో చౌడేశ్వరిదేవి, కామాక్షమ్మతల్లి, మన్నూరులో ఉదయగిరి యల్లమ్మతల్లి ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. రాజంపేట పాతబస్టాండు కూడలిలో కనీవిని ఎరుగని రీతిలో పేల్చిన బాణాసంచా విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నాగపాము పడగలో పేలిన విన్యాసం, ఆకాశంలో బాణాసంచా పేలుళ్లను చూసి పరవశించిపోయారు. రాజంపేట పట్టణం పురవీధుల్లో అమ్మవార్ల గ్రామోత్సవం డప్పుల వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. భారీఎత్తున అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు.

అన్‌లైన్ బెట్టింగులకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి

- రూ.24 లక్షలు పోగొట్టుకున్నట్లు సూసైడ్ నోట్
- రైలు కింద పడి బలవన్మరణం




పద్మనాభరెడ్డి (ఫైల్)

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13: అన్‌లైన్ బెట్టింగులకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి తాను రూ.24 లక్షలు పోగొట్టినట్లు, నాలా మీరు ఎవరూ అన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని.. అప్పులు తీర్చలేక, తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టకూడదని తాను రైలుకిందపడి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు, నా చావుకు ఎవ్వరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసి శుక్రవారం అర్ధరాత్రి సీటీఎం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి రైల్వే పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ దిగువ గాలిగుట్టపల్లెకు చెందిన నడిమింటి వెంకటరమణారెడ్డి కుమారుడు పద్మనాభరెడ్డి (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. గేమ్‌లు ఆడి రూ.24 లక్షలు పోగొట్టుకుని అప్పులు తీర్చలేక తీవ్రంగా మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసి జేబులో ఉంచుకుని మదనపల్లె మండలం సీటీఎం సమీపంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లెకు వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయాన్నే స్థానికులు గుర్తించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ బాషా ప్రమాద స్థలంలో పంచనామా నిర్వహించి అక్కడే పడి ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ బెంగళూరులో పనిచేస్తున్న కంపెనీ ఐడీ కార్డు, ఆధార్‌కార్డును గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో బంధువులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. దిగువ గాలిగట్టుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వీరభద్రుడికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు



వీరభద్రుడికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



రాయచోటి టౌన్, అక్టోబరు 13: విజయదశమి సందర్భంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి శనివారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభంతో మంత్రి దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ మండపంలో మంత్రి దంపతులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రం సుభిక్షంగా ఉండి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామి, అమ్మవార్లను వేడుకున్నానన్నారు. విజయదశమి సందర్భంగా వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 13: జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ నివేదిక నేపథ్యంలో ఈనెల 14వ తేదీ సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

రాయచోటిటౌన్, అక్టోబరు 13: ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విజయదశమి సందర్భంగా ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని పోలీసు ఆయుధాగారం, పోలీసు వాహనాల విభాగాల్లో దుర్గామాత చిత్రపటం, ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో జిల్లా ప్రజలు, జిల్లా, రాష్ట్ర పోలీసులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం విధుల్లో వినియోగించే ఆయుధాలకు, పోలీసు విభాగంలోని వివిధ రకాల వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలతో పాటు జిల్లా, రాష్ట్ర పోలీసులు, వారి కుటుంబ సభ్యులు సంతోషంగా జీవించాలని, పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు. పూజా కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ టీవీ సత్యనారాయణ, డ్యూటీ ఆఫీసర్ ఆర్ఎస్ఐ జి.రవి, ఏఆర్ ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, కుప్పుస్వామి, ఆర్మ్‌డ్ సిబ్బంది భాస్కర్, రఘునాథ్, స్థానిక పోలీసులు, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.



పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయుధపూజ చేస్తున్న పోలీసు అధికారులు

2160 మందిలో అదృష్టవంతులెవరో..?

- 111 మద్యం దుకాణాలకు నేడు లాటరీలో ఎంపిక
- మోడల్ షాపునకు రూ.5 లక్షలు అదనం

మదనపల్లె టౌన్, అక్టోబరు 13: మద్యం దుకాణాలు 111... రూ.2 లక్షలు చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించిన 2160 మంది ఆశావహులు. వీరిలో ఎవరిని అదృష్టం వరిస్తుందో... ఎవరికి లైసెన్సు దక్కుతుందో తేలడానికి మరికొన్ని గంటల సమయమే ఉంది. జిల్లా నలుమూలల నుంచి 2160 మంది దరఖాస్తుదారులు, వారి అనుచరులు పోలోమంటూ రాయచోటికి చేరుకోనున్నారు. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుదారుల ఎంపిక రాయచోటిలోని అజయ్ కన్వెన్షన్ హాలులో సోమవారం జరగనుంది. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎక్సైజ్ ఈఎస్ మధుసూదనరావు సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణాలు ఎవరికి కేటాయించాలో నిర్ణయిస్తారు.

జిల్లాలో 111 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు గెజిట్ వెలువడగా ఈనెల 9వ తేదీ వరకు వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచి 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు పొడిగించడంతో ఒక్కసారిగా దరఖాస్తులు పెరిగాయి. 111 మద్యం దుకాణాలకు 2,160 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువగా మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ నుంచి 649 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. కలికిరిలోని మూడు దుకాణాలకు తక్కువగా దరఖాస్తులు వచ్చాయంటే అక్కడ ఆశావహులకు కొందరి నుంచి ఎంత ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవచ్చు.

అందరి సమక్షంలో లాటరీ విధానం

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరి సమక్షంలో సోమవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో లాటరీ విధానంలో లైసెన్సులు ఎంపిక చేస్తారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో గల రాయచోటి-మదనపల్లె రోడ్డులోని అజయ్ కన్వెన్షన్ హాలులో నిర్వహించే ఈ లాటరీ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఎనిమిది స్టేషన్‌లకు అందిన దరఖాస్తుల వివరాలను క్రోడీకరిస్తారు. ఎంట్రీ పాస్‌లు పొందిన వ్యక్తులను మాత్రమే లాటరీ ఎత్తే హాలులోకి పంపుతారు. ఇక్కడ గెజిట్ ప్రకారం 111 మద్యం దుకాణాల నెంబర్ల ఆధారంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తారు. ఒక్కోషాపునకు ఎంత మంది దరఖాస్తు చేసుకుంటే అన్ని టోకెన్లు కంప్యూటర్‌లో జనరేట్ చేసిన టోకెన్‌లను తీసి చూపుతారు. నాలుగు రంగుల్లో ఈ టోకెన్లు ఉంటాయి. కలెక్టర్ సమక్షంలో ఒక్కో షాపునకు ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అన్ని నెంబర్లు ఉండే టోకెన్లను అందరికీ చూపుతారు. ఈ టోకెన్లను గుండ్రంగా ఉండే ఒక బాక్సులో వేసి తిప్పుతారు. స్వయంగా కలెక్టర్ ఈ బాక్సులో నుంచి ఒక టోకెన్‌ను బయటకు తీసి, ఏ నెంబర్‌కు లాటరీ తగిలిందో ప్రకటిస్తారు. దీంతో పాటు ప్రత్యామ్నాయంగా మరో రెండు టోకెన్లను కూడా బయటకు తీస్తారు కానీ వాటిని ప్రకటించరు. ఇక్కడ గమనించాల్సి విషయం ఏమిటంటే 6వ నెంబరు, 9వ నెంబరు టోకెన్‌లు ఒకే పోలికలో ఉంటాయి. ఈ వ్యత్యాసాన్ని గుర్తించేందుకు ఈ రెండు టోకెన్లకు ప్రత్యేక మార్కింగ్ వేస్తారు. లైసెన్సు పొందిన దరఖాస్తుదారుడు అప్పటికప్పుడే లైసెన్సు మొత్తంలో 1/6 మొత్తం నగదు అక్కడే చెల్లించాలి. అలా చెల్లించని పక్షంలో ఇది వరకే ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసిన రెండు టోకెన్ల దరఖాస్తుదారుల్లో మొదటి వ్యక్తికి, అతను డీఫాల్ట్ అయితే రెండో వ్యక్తికి లైసెన్స్ మంజూరు చేస్తారు. ఈ లాటరీ ప్రక్రియ అంతా పారదర్శకంగా వీడియో కవరేజ్ మధ్యనే జరుగుతుంది. లైసెన్సు దక్కించుకున్న వ్యక్తి 1/6 లైసెన్సు ఫీజు చెల్లించిన వెంటనే అతనికి తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేస్తారు. మరుసటి రోజైన 15వ తేదీ నుంచే అతను మద్యం దుకాణం ఏర్పాటు చేసుకుని, ఐఎంఎల్ డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం విక్రయించుకోవచ్చు.

మోడల్ షాపులకు రూ.5 లక్షలు అదనం

సాధారణంగా మద్యం దుకాణాల బయటే వినియోగదారుడు ఉండి తనకు కావాల్సిన మద్యం బ్రాండు పేరు చెబితే సేల్స్‌మెన్ డబ్బు తీసుకుని ఆ బ్రాండు బాటిల్‌ను వినియోగదారుడికి అందిస్తారు. అలా కాకుండా సూపర్‌మార్కెట్ తరహాలో ఈసారి మోడల్‌షాపులు ఏర్పాటు చేసుకునే వెసులుబాటు వచ్చింది. లైసెన్సు ఫీజుతో పాటు రూ.5 లక్షలు అదనంగా చెల్లిస్తే ఆ లైసెన్సుదారుడు మోడల్ షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ షాపులోకి వినియోగదారుడే స్వయంగా వెళ్లి కావాల్సిన మద్యం బ్రాండును కొనుగోలు చేసుకోవచ్చు.



రాయచోటిలోని అజయ్ కన్వెన్షన్ హాలులో లాటరీ విధానంపై సూచనలిస్తున్న ఎక్సైజ్ ఈఎస్ మధుసూదనరావు

ఇసుకాసురుల చెరువు

గుర్రంకొండ మండలంలో ఇసుక బంగారం కన్నా విలువైందిగా మారింది. ఈ తెల్ల బంగారాన్ని ఇసుకాసురులు ఇష్టానుసారంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక కోసం అక్రమార్కులు చెరువులు, కుంటలను తవ్వేస్తున్నారు. ఇలా చెరువులో ఎక్స్‌కవేటర్లను ఉంచి పైనున్న మట్టి పొరలను తొలగించి ఇసుకను తోడేస్తున్నారు. ట్రాక్టర్లల్లో ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఇసుకను బయట ప్రాంతాలకు తరలించి వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులు, కుంటల్లో ఇసుకను ట్రాక్టర్లలో తరలించడానికి నాయకుల అనుమతి తప్పనిసరిగా మారింది. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇసుక చెరువు నుంచి బయటకు రావాలంటే రూ.300 నాయకులకు చెల్లించాల్సిందే. ఇలా గుర్రంకొండ మండలంలో చెరువులను నాయకులు చెరపట్టి వాటి రూపురేఖలనే మార్చేస్తున్నారు.

- ఇసుక అక్రమంగా తరలింపు
- ట్రాక్టర్ లోడ్‌కు రూ.300 ఇవ్వాల్సిందే



రామానాయుని చెరువులో ఇసుకను లోడ్ చేస్తున్న ఇసుకాసురులు (ఫైల్)

గుర్రంకొండ, అక్టోబరు 13: గుర్రంకొండ మండలంలోని చెరువులపై ఇసుకాసురుల కన్నుపడింది. ఈ క్రమంలో తరిగొండ పంచాయతీ పరిధిలో రామానాయుని చెరువు ఉంది. ఈ చెరువులో ఇసుక బాగా ఉండడంతో ఇసుకాసురులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఇందులో భాగంగా ఇసుక కోసం చెరువులో పైనున్న మట్టి పొరలను తొలగించి ఇసుకను తరలిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఉంచి బయట ప్రాంతాలకు ఇసుకను తోలేస్తున్నారు. ఇసుకాసురుల ధాటికి రామానాయుని చెరువు ఎటుచూసినా గుంతల మయంగా మారింది.

లోడ్ ఇసుకకు రూ.300

రామానాయుని చెరువులో ట్రాక్టర్ ఇసుకను తరలించాలంటే ఓ నాయకుడికి రూ.300 ఇసుకాసురులు చెల్లిస్తున్నారు. ఇసుకాసురులు సొమ్ము ఇవ్వకుంటే ట్రాక్టర్‌కు ఇసుక నింపనివ్వరు. దీంతో అక్రమార్కులు సొమ్ము చెల్లించి ఇసుకను తరలిస్తున్నట్లు గ్రామస్థులు, ఆయకట్టు రైతులు చర్చించుకుంటున్నారు. చెరువులో ఇసుకకు సొమ్ము వసూలు చేయడమేంటని కొందరు పెదవి విరుస్తున్నారు.



చెరువు చుట్టూ ట్రెంచ్ తీయిస్తున్న వీఆర్వో రెడ్డిశేఖర్ (ఫైల్)

రెవెన్యూ అధికారులను ఖాతరు చేయడం లేదు..

రామానాయుని చెరువులో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులకు ఇసుక తరలించరాదంటూ పలుమార్లు హెచ్చరించాం. ఈ క్రమంలో చెరువు చుట్టూ ట్రెంచ్ కూడా తవ్వించాము. రెవెన్యూ అధికారుల ఆదేశాలను ఇసుకాసురులు ఖాతరు చేయడం లేదు. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటే రెవెన్యూ సిబ్బందిపై మండిపడుతున్నారు.

- రెడ్డిశేఖర్, వీఆర్వో, తరిగొండ, గుర్రంకొండ మండలం

ఇసుకాసురులపై చర్యలు తీసుకొంటాం..

రామానాయుని చెరువులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు సూచించాం. చెరువులో ఇసుక తవ్వకాలను పరిశీలించి అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకుంటాం.

- ఈశ్వరి, మండల ఇరిగేషన్ అధికారి, గుర్రంకొండ మండలం

శ్రీ కృష్ణాడెంటల్ కేర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రారంభోత్సవంలో కమలాపురం ఎంఎల్ఏ పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



అస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ బ్రిజేష్ క్రిష్ణ తల్లి అనసూయదేవి చిత్రంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

కడప (మారుతీనగర్) అక్టోబరు 13: అత్యాధునిక వసతులతో కడపలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణా డెంటల్ కేర్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎంఎల్ఏ పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక సీఎస్ఐ చర్చి ఎదురుగా కొత్తగా ప్రారంభించిన శ్రీకృష్ణా డెంటల్ కేర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కడప నాగరాజుపేటలో ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించిన సంస్థ రెండో బ్రాంచ్‌గా అత్యాధునిక వసతులతో మరింత నూతన వసతులతో ప్రారంభించామన్నారు. ఇందులో ఎక్స్‌రే, లేజర్ మిషన్, మిగతా వైద్యానికి సంబంధించిన ఆధునిక పరికరాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని, కావున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శ్రీ కృష్ణా డెంటల్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు బ్రిజేష్ క్రిష్ణ చైర్మన్ బండారు రాజగోపాలయ్య, మాట్లాడుతూ దంత వైద్యశాలలో ఎలాంటి ఫీజు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు దంత వైద్యం అందించే వసతి ఉందన్నారు. ఈ దంత వైద్యశాలలో చాలా తక్కువ ధరలతో పేదలకు చికిత్స చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ రాజకీయవేత్త పీవీఎస్ మూర్తి, టీడీపీ జనరల్ సెక్రటరీలు బి. హరిప్రసాద్, ఎస్. గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్. అమీర్‌బాబు, మైనార్టీ నేతలు సుభాన్‌బాష, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

'బకాయిల చెల్లింపులో జాప్యం తగదు'

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 13: ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులో జాప్యం తగదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపుల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకోసం దాచుకున్న పీఎఫ్ సొమ్మును సైతం వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండరు లీవు బకాయిలు, డీఏ బకాయిలు, గత పీఆర్సీ బకాయలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.22వేల కోట్ల పైబడిన బకాయిలను ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని వారు కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిసారించడం లేదన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ గత పాలకుల వైఖరితో పీఆర్సీ అమలుకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం సైతం 12వ పీఆర్సీ అమలు పట్ల చిత్తశుద్ధి కనబరచలేదని ఆరోపించారు. దసరా కానుకగా ఐఆర్ ప్రకటిస్తారని ఎదురు చూసిన ఉద్యోగుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, క్రిష్ణారెడ్డి, అన్నమయ్యజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిద్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లను దగ్ధం చేసిన దుండగులు



మంటల్లో కాలిపోయిన బైక్‌లు

బద్వేలుటౌన్, అక్టోబరు 13: స్థానిక వెంకటయ్యనగర్‌లో రెండు బైక్‌లను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. వివరాల్లోకెళితే... వెంకటయ్యనగర్‌లో నివాసం ఉంటున్న తలకట్ల వెంకటేష్, తలకట్ల మహేష్ వాహనాలను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనాలకు నిప్పంటించారు. దీంతో ద్విచక్రవాహనాలు పేలినట్లు శబ్ధం రావడంతో వీధిలోని వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి బయటకు వచ్చారు. వాహనాలు కాలుతుండటం చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వాహనదారులు దుకాణాల్లో గుమ్మస్తాలుగా పనిచేస్తున్నారు. తమ వాహనాలను ఎందుకుకాల్చారో అర్థంకావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అసంపూర్తిగా నాడు- నేడు రెండో విడత భవనాలు

సమస్యల ఒడి - మాసాపేట బడి

ప్రహరీ లేక పాఠశాలలోకి పశువులు ● అధ్వాన్నంగా మరుగుదొడ్లు.. అవస్థల్లో విద్యార్థులు

అసంపూర్తిగా నాడు - నేడు పనులు ● పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



ప్రహరీ లేని మాసాపేట హైస్కూల్ దక్షిణభాగం - తూర్పు భాగం - ఉత్తర భాగం, లోనికి వచ్చిన పశువులు

రాయచోటిటౌన్, అక్టోబరు13: అన్నమయ్య జిల్లా కేంద్రం, కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు 700 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు ఉన్న మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. జిల్లా కేంద్రంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ ఉన్నత పాఠశాలకు ఉత్తరం, తూర్పు భాగాల్లో రెండు వైపులా ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో రక్షణ లేదని చెప్పవచ్చు. ప్రహరీ లేని కారణంగా పటిపూట హైస్కూల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మేతకోసం వచ్చే పశువులు, గొర్రెలు పాఠశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకంగా మారుతోంది. దీనికి తోడు రాత్రి సమయాల్లో మందుబాబులు పాఠశాల ఆవరణలోకి వచ్చి మద్యంతాగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బ్రేకు వదిలిన సమయంలో కొందరు విద్యార్థులు బాత్‌రూంకు అంటూ బయటకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు పీడీలు కాపలా కాస్తున్నా కొందరు విద్యార్థులు వారి కళ్లు గప్పి బయటకు వెళ్లిపోతున్నట్లు సమాచారం. పాఠశాల నైట్ వాచ్‌వుమెన్‌పై కూడా అఘాయిత్యం జరిగినట్లు సమాచారం.

అయితే ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది బయటకు రానివ్వకుండా మేనేజ్ చేసినట్లు తెలుస్తోంది. నైట్ వాచ్‌వుమెన్ ఉండడానికి ఒక గది ఇవ్వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులును అడిగినా వాచ్‌మెన్‌కు గది ఆమెపై అఘాయిత్యం జరిగిందని పలువురు అంటున్నారు. పాటవాల భవనాలు కొన్ని పాతవి కావడంతో అక్కడక్కడ బండలు లేచిపోయి తరగతుల నిర్వహణకు ఇబ్బందికరంగా ఉండడంతో నాడు- నేడు రెండో విడత కింద మంజూరైన 8 గదుల భవనం ఒకటి, రెండు గదుల భవనం మరొకటి అసంపూర్తిగానే ఉండిపోయారు. ఫలితంగా ఒక్కో సమయంలో విద్యార్థులకు చెట్ల కింద కూర్చోబెట్టుకుని చదివించుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నాడు-నేడు రెండో విడత కింద మంజూరైన 8 గదుల భవనం ఒకటి, రెండు గదుల భవనం మరొకటి అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఫలితంగా ఒక్కో సమయంలో విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టుకుని చదివించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నాడు- నేడు పనులు అలాగే ఉండిపోయాయి. ఫలితంగా విద్యార్థులను గదులు కొరత వెంటాడుతోంది. చాలా మంది హాస్టల్ విద్యార్థులు, గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలు చదువుతున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. నాడు- నేడు పథకం కింద ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో కంపు కొడుతూ అసౌకర్యంగా మారాయి. ప్రత్యేక సిబ్బంది ఉన్నా వాటిని పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లకు ఏర్పాటు చేసినడోర్లు పగలగొట్టడమే కాకుండా స్విచ్ బోర్డులు పగలగొట్టి ప్రమాదకరంగా తయారు చేశారు. వాటిని విద్యార్థులు పగలగొట్టారా లేక ప్రహరీ లేని కారణంగా ఎవరైనా మందుబాబులు, ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి వచ్చి పగలగొట్టారా అనే విషయం అర్థం కావడం లేదు. పాఠశాలలో ముగ్గురు ఆయాలున్నా మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ లోపమని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణకు ముఖ్యమైన ప్రహరీ లేకపోవడంతోనే పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని సిబ్బంది సహా విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రహరీ ఏర్పాటు చేసి ఉన్నత విద్యార్థుల విద్య కుంటు పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కూటరు, కారు ఢీ - ఒకరికి గాయాలు



దెబ్బతిన్న కారు ముందుభాగం

ఖాజీపేట, అక్టోబరు 13: కడప, కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె క్రాస్‌రోడ్డువద్ద కారు, స్కూటరు ఢీకొనడంతో కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రావులపల్లె హరిజనవాడ వాసి కుమార్ పని నిమిత్తం ఖాజీపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా రావులపల్లె వద్ద రోడ్డు క్రాస్ అవుతుండగా కడప నుంచి నంద్యాలకు వెళుతున్న కారు ఢీకొనడంతో కారు భారీగా దెబ్బతినింది. కుమార్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు 108 ద్వారా తరలించారు.

22 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 13: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధి ఈడిగపేటలో శనివారం రాత్రి 22 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వెంటనే పేకాటస్థావరంపై తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన 22 మందిని స్టేషన్‌కు తీసుకువచ్చి వారి నుంచి రూ.1,20,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మెడకు తాడు బిగించి చంపి.....

మృతదేహం మర్మాంగాలను కాల్చిన భార్య ● పెనుగొండలో భర్తను హత్య చేసిన భార్య, అత్త, బావమరిది

పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ ● వీడిన హత్యకేసు మిస్టరీ




ప్రశాంత్ మృతదేహం (ఫైల్)

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 13: తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండలో కడప వాసి లక్కే ప్రశాంత్ (30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరి వేసి చంపారు. అనంతరం కసి తీరక అట్ల గరిటతో మర్మాంగాలను భార్య కాల్చింది. లక్కే ప్రశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసు విచారణ అనంతరం మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ గూడూరు సీఐబాబురావు తెలిపిన ప్రకారం వివరాల్లోకెళితే... కడప జిల్లా సింహాద్రిపురం మండలం చవ్వారిపల్లి వాసి అమీనాను ప్రేమవివాహం చేసుకున్నాడు. కాగా ఉపాధి కోసం నాలుగు నెలల కిందట భార్య, పిల్లలతో కలిసి ప్రశాంత్ పెనుగొండలో భవన నిర్మాణ పని చేసేందుకు వచ్చాడు. అమీనాకు రెండో పెళ్లి కావడంతో భర్త ప్రశాంత్ అమెను అనుమానిస్తూ పిల్లలు నాకు పుట్టలేదంటూ నిత్యం మద్యం తాగి వచ్చి ఆమెను కొడుతుంటాడు. ఈ క్రమంలో తనను నిత్యం శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని, ఇదే గ్రామంలో ఉంటున్న పులివెందుల మండలం ఎర్రగుడిపల్లి వాసి అమినా తల్లి కడియాల నూర్జహాన్, సోదరుడు కడియాల అమర్ బాషాకు తన గోడు వెల్లబోసుకుంది. ప్రశాంత్ తనను, తన పిల్లలను, అవసరమైతే మిమ్మల్ని కూడా చంపుతానని బెదిరిస్తున్నాడని అమీనా తల్లి, సోదరునికి తెలిసింది. ప్రశాంత్‌ను చంపాలని ముగ్గురు కలిసి నిర్ణయించుకుని ఈనెల 10న అర్ధరాత్రి తర్వాత 2.30గంటలకు ముగ్గురూ కలిసి తాడుతో ప్రశాంత్ మెడకు ఉరివేసి చంపారు. అయినా కసి తీరక అమీనా అట్ల గరిట(సరాతం)ను స్టౌపై వేడి చేసి తన భర్త ప్రశాంత్ మర్మాంగంపై కాల్చింది. ఆ తర్వాత గ్రామంలో ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడవేయాలని నిర్ణయించుకుని ఆటో డ్రైవర్ రామును పిలిచారు. డ్రైవర్‌ను మభ్యపెట్టి మృతదేహాన్ని ఆటోలో రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా అనుమానించిన డ్రైవరు వారిని నిలదీయగా హత్య విషయం బయటపడింది. దీంతో రాము 100 పోలీసులకు, 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది ప్రశాంత్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించారు. నిందితులు అమీనా, నూర్జహాన్, అమర్ బాషాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సమయస్ఫూర్తితో పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ రామును, కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ మురళీధర్‌రాజ్‌ను ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి కత్తి పోట్లు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13: పట్టణంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి కత్తిపోటు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే ఆంధ్రకేసరి రోడ్డుకు చెందిన చింతల సుధీర్ శనివారం రాత్రి దసరా సంబరాలు తిలకించడానికి రాజీవ్ సర్కిల్‌కు స్నేహితులతో వచ్చాడు. గుంపుల్లోవున్న ఒకరు సుధీర్ మీద పడడంతో స్వల్పంగా ఘర్షణ పడ్డారు. తరువాత అక్కడి నుంచి వెళ్లి తన స్నేహితులు నలుగురితో కలిసి వచ్చి కత్తితో సుధీర్ కడుపుపై భాగనా పొడిచాడు. అక్కడి నుంచి వారు పరారయ్యారు. బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శ్రీనివాస నగర్ వాసి పెయింటర్ కాలేషావలి శనివారం రాత్రి మైదుకూరు రోడ్డులో ఖాళీ బండపై కూర్చుని వుండగా ఖాసీపీరా వచ్చి సిగరేట్ తాగుతూ నిలబడ్డాడు. సిగరేట్‌పొగ నచ్చని కాలేషావలి పక్కకు వెళ్లమని ఖాసీంపీరాను కోరగా కాలేషా వలితో గొడవపడ్డాడు. దీంతో అక్కడి నుంచి వెళ్లిన ఖాసీం పీరా నలుగురితో వచ్చి కాలేషావలిపై కత్తితో దాడి చేశాడు. కాలేషావలికి తీవ్ర గాయాలవడంతో అతన్ని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ

ఎంట్రీ సహా వినోదపరికరాలకు అధికరేట్లు ● అమలు కాని గెజిట్ రేట్లు

ధరలను నియంత్రించలేని మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు అక్టోబరు 13: పసిడిపురి దసరా ఉత్సవాలు రెండో మైసూరును తలపిస్తుంది. వివిధ ఆలయాల్లో అమ్మవారి అలంకారాలు ఎంతో కనువిందు గొలుపుతాయి. ఇక్కడికి రాష్ట్రేతర భక్తులు సైతం వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటుంటారు. దీంతో పట్టణం నిత్యం భక్తులు, కొత్త, పాత వారితో కళకళలాడుతుంటోంది. ఇలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌తో ప్రజలకు మరింత వినోదం అందుతుంది. దసరా సంబరాల సందర్భంగా ఏటా అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఈ ఏడాది టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనుచరవర్గం ఎగ్జిబిషన్ వేలం పాటను రూ.1.75 కోట్లకు దక్కించుకుంది. 45 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు లీజు వేలం డబ్బు సహా 18 శాతం జీఎస్టీ కలిసి మొత్తం 2.6కోట్లు మున్సిపాలిటీకి చెల్లించాలి. దీంతో మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ఇంత పెద్ద మొత్తం లీజు వేలంలో పోవడం ఇదే మొదటి సారి. దీంతో నిర్వాహకులు ఈ నెల 4 తేదీ నుంచి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎంట్రీ టిక్కెట్లు పెద్దలకు రూ.25 పిల్లలకు రూ.15 నిర్ణయించారు. వినోద పరికరాలు ఏవైనా రూ.80 మాత్రమే వసూలు చేయాలని అధికారులు బ్యానర్లు పెట్టి ప్రచారం చేశారు. కానీ మొదటి రోజు నుంచే నిర్వాహకులు రూ.25 వున్న పెద్దల టిక్కెట్టుకు రూ.30, రూ.15 వున్న పిల్లల టిక్కెట్లు రూ.20 పెట్టారు. వినోద పరికరాలకు రూ.80 వుంటే రూ.100 వసూలు చేస్తున్నారు. ఇందుకు నిర్వాహకులు టిక్కెట్లు ధరలపై రూ.18 శాతం జీఎస్టీ సహా కలిపి వసూలు చేశామని అధికారులకు సమాధానమిచ్చింది. దీంతో అధికారులు, ప్రజలు, ప్రతిపక్షాలు సైతం దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. విజయ దశమి రోజున రూ.25 రూపాయల వున్న ఎంట్రీ టిక్కెట్లు కొన్ని గంటలపాటు రూ. 50 పెంచారు. తరువాత రూ.100 పెంచారు. వినోద పరికరాలు రూ.100 వున్నవి రూ.150కి పెంచారు. దీంతో పెద్దఎత్తున టీడీపీ నేత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. వైసీపీ నేత మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డి సైతం ప్రెస్‌మీట్ పెట్టి ఎగ్జిబిషన్‌లో జరిగిన దోపిడీని ఎండగట్టాడు. అధికారులు చర్యలు తీసుకోకపోతే చట్టపరంగా కోర్టులో కేసు వేస్తామని బంగారు రెడ్డి హెచ్చరించారు. విజయదశమి ఒక్కరోజు నిర్వాహకులు అధికరేట్లు వసూళ్లు చేయడంతో అధికార ప్రతిపక్ష నేతలు దీన్ని ఎమ్మెల్యే వర్గం దోపిడీగా అభివర్ణించే ప్రయత్నం చేస్తూ ఆరోపించారు. ఎగ్జిబిషన్‌లో రూ.5 కోట్లమేర దోపిడీ జరిగిందని బంగారు రెడ్డి ఆరోపించారు. ఇదంతా వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి ఆదేశాలతో జరిగిందని ఆరోపించారు. దీన్ని ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ ఆర్‌వీ చలపతి తీవ్రంగా ఖండించారు. ఈ ఎగ్జిబిషన్‌కు ఎమ్మెల్యేకు సంబంధం లేదని కేవలం కొందరు పనికట్టుకుని ఆరోపిస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్‌లో విజయదశమినాడు కేవలం రూ.50 మాత్రమే టికెట్టు వసూలు చేశామని చలపతి ఆంధ్రజ్యోతికి వివరణ ఇచ్చారు. అయితే ఆదివారం కూడా రూ.50 నుంచి రూ.100 వసూలు చేశారని ఆరోపణలున్నాయి. మున్సిపల్ ఆర్ఐ చరణ్‌రెడ్డిని వివరణ కోరగా కేవలం విజయ దశమి రోజు రాత్రికొన్ని గంటలు రూ.50 నుంచి రూ.100 వసూలు చేశారని తాము అక్కడే వుండి టికెట్ల ధరలు ఎంతకు విక్రయించేది పరిశీలించామని తెలిపారు. అధిక రేట్లకు విక్రయిస్తే కమిషనర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించి వచ్చామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో అధిక రేట్లు విక్రయించడం ఏటా జరుగుతూనే వుంటున్నదే. దీనిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం కేవలం తమకు కట్టవలసిన లీజు డబ్బు రాబట్టుకోవడంపై మాత్రమే వారు దృష్టి పెట్టి ప్రజలు అధిక రేట్ల దోపిడికి గురికావడాన్ని పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిండు ప్రాణం బలిగొన్న బాకీ



భర్త నిర్బంధం భార్య బలవన్మరణం

రాపూరు, అక్టోబరు 13: కూటి కోసం చేసిన అప్పు నిండు ప్రాణాన్ని బలిగొంది. బకాయిలో కొంత మొత్తం చెల్లించినా అంగీకరించని యజమాని భర్తను నిర్బంధించడంతో మనస్థాపానికి గురైన భార్య చెంచులక్ష్మి (24) విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది ముమ్మాటికీ వెట్టిచాకిరీ అని చెప్పవచ్చని రాష్ట్ర యానాది సంఘం ఆరోపిస్తోంది. గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన యజమానిని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలం మద్దెలమడుగు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే...

తిరుపతి జిల్లా దక్కిలి మండలం దండోలు వాసులు ఏకోలు రవీంద్ర, చెంచులక్ష్మి గిరిజన దంపతులను అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని ఓ గ్రామం వద్ద సిమెంటు అచ్చులు తయారీ పనుల కోసం యజమాని వెంకటసుబ్బారెడ్డి తీసు కెళ్లాడు. సరైన కూలి రాకపోవడంతో వారు రాపూరు మండలం మద్దెలమడుగు వద్ద మరోపనిలో చేరి బకాయి నిమిత్తం కొంత మొత్తాన్ని యజమాని సుబ్బారెడ్డికి పంపించారు. అయినా అంగీకరించని వెంకటసుబ్బారెడ్డి ఇటీవల కొందరితో కలిసి మద్దెలమడుగు వద్దకు వచ్చి భర్త రవీంద్రను బలవంతంగా తీసుకెళ్లాడు. వారం గడిచినా భర్తను వదిలిపెట్టకపోవడంతో మనస్థాపానికి గురైన భార్య చెంచులక్ష్మి శనివారం రాత్రి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను చికిత్సవ నిమిత్తం మొదట రాపూరు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై బాధితులు రాపూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ప్రజా సంఘాల దృష్టికి వెళ్లడంతో రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య స్పందించి ఉన్న తాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వాస్తవాలు సమగ్రంగా విచారించి వెట్టిచాకిరీ చేయించుకుని గిరిజన మహిళ ఆత్మహత్యకు కారణమైన యజమానిని అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు.

విద్యుత్‌షాక్ తగిలి వ్యక్తి మృతి

చిట్వేలి, అక్టోబరు 13: వెంకటరాజుపల్లె అరుంధతీవాడ వాసి కొత్తూరు నరసింహులు(54) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో టీవీని మారుస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి నరసింహులు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య రత్నమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పండగ పూట పస్తులే : తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 13: ధరల పెరుగుదలతో పండగ పూట పస్తులే అని ఏపీసీసీముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వేంపల్లెలో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో సరుకుల ధరలు విపరీతంగా పెరిగి నింగినంటుతున్నాయన్నారు. సామాన్యులు పండగపూట పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయన్నారు. కందిపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి, చింతపండు ధరలు మండిపోతున్నాయన్నారు.


మంగంపేట గ్రామదేవత పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్


నందలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దేవతామూర్తుల అలంకారంలో చిన్నారులు


రాజంపేటలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పెనగలూరు: దుర్గామాత ఊరేగింపు, వసంతోత్సవంలో వినాయకనగర్‌వాసులు

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

రాయచోటి టౌన్, అక్టోబరు13: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని వీరభద్రాలయంలో అమ్మవారు విజయ దుర్గాదేవి అలంకారంలో, అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దాక్షాయణి, కొత్తపేట చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా, దర్శనమిచ్చారు. చెక్‌పోస్టు శివాలయం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

గాలివీడు: మండలంలోని గుండ్లచెరువు పంచాయతీ పసువులవాండ్ల పల్లె సమీపంలో శనివారం ప్రమోద్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలతో పాటు అన్నదానం చేశారు. ఆఖరి రోజు శనివారం అమ్మవారి లడ్డును బురుజుపల్లెకు చెందిన రవీంద్ర రూ.1,26,000కు వేలంలో దక్కించుకున్నారు. బ్రాహ్మణవీధి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా స్వామి వారి మాస కల్యాణం నిర్వహించారు. గోపనపల్లె ఇరుగులమ్మ ఆలయంలో రాజ రాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శన మిచ్చారు. వేదపండితుడు నాగఫణి కిశోర్‌శర్మ దసరా పర్వదినం విశిష్టతను తెలియజేశారు. చివరగా శమీ పూజ నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె: విజయదశమి సందర్భంగా సర్వమంగళాదేవి శనివారం విజయదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అమ్మవారి ఊరేగింపులో కోలాటాలు, చెక్క భజనలు, డీజే, నృత్య ప్రదర్శనలు చేశారు.

సంబేపల్లె: విజయదశమి సందర్భంగా నల్లగంగమ్మ రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. హోమాలు, పూజలు నిర్వహించారు.

సుండుపల్లె: మండల కేంద్రంలో శనివారం కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం దశమి వేడుక లను నిర్వహించారు.

పెనగలూరు: తూర్పుపల్లె చౌడేశ్వరి ఆలయంలో ఆదివారం అన్నదానం చేశారు. సాతపల్లెలో గంగమ్మ ఆలయం వద్ద నరసాపురం ఈశ్వర య్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కొత్తపల్లెలో కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో 8 మంది బాలికలను అష్ట లక్ష్ములుగా అలంకరించారు. పెనగలూరులో నయనేశ్వరాలయంలో అమ్మవారు దశావతారాలతో దర్శనమిచ్చారు. పాత శింగనమలలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈటమాపురంలో రేణుకా ఎల్లమ్మ, ఓగురమ్మ దేవతలకు పొంగుబాళ్లు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో సత్యమ్మ, కాళికాదేవి, మంగం పేటలో గ్రామదేవతకు మొక్కులు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మె ల్యే అరవ శ్రీధర్, టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, గునిపాటి చెన్నరాయుడు, గునిపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు. మంగళంపల్లె, కాకర్లవారిపల్లె, బోటుమీద ఎల్లెలోని మల్లాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. బలిజపల్లె, పెద్దఓరంపాడు, చిన్నఓరంపాడు, కమ్మపల్లె, అయ్యలరాజుపల్లెల్లోని గంగమ్మ, ఎల్లమ్మ, అంకాలమ్మ ఆలయాల పరిధిలో అన్నదానం, భజన బృందం చెక్క భజన, పండరి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఒంటిమిట్ట: డోలాధిరోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల వద్ద వసంతోత్సవాలు నిర్వహించారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లెలోనికన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. సాయంత్రం జమ్మి దర్శనం కార్యక్రమం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

రామాపురం: వసంతోత్సవం, పాన్పుసేవతో నీలకంఠ్రావుపేటలో ఆదివారం శరన్నవరాత్రోత్సవాలు ముగిశాయి.

రాజంపేట టౌన్ : విజయదశమి సందర్భంగా అమ్మవారిశాల కన్యకా పరమేశ్వరిదేవి, రెడ్డివారివీధిలో చౌడేశ్వరిదేవి, కామాక్షమ్మతల్లి, మన్నూ రులో ఉదయగిరి ఎల్లమ్మతల్లి ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. రాజంపేట పాతబస్టాండు కూడలిలో బాణసంచా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భారీఎత్తున అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతపురం గంగమ్మ ఆలయ ఈవోగా శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 13: అనంతపురం గంగమ్మ జాతర ఆలయ ఈవోగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. లక్కిరెడ్డిపల్లె వీరభద్రాలయం ఈవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై అనంతపురం గంగమ్మ జాతర ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఆదివారం గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలియజేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సుండుపల్లె, అక్టోబరు 13: మండలంలోని తిమ్మ సముద్రం గ్రామంలోని రామాలయంలో ఆదివారం మిక్కిలి నేని జయరాంనాయుడు కుటుంబీకులు ఆంజనే య స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలి పారు. అనంతరం అభిషేకం, హోమం చేశారు. రవినాయుడు కుటుంబీకులు అన్నదానం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వీరబల్లి, అక్టోబరు 13: తమ గ్రామంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడడమే తమ ధ్యేయమని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి తెలిపారు. మట్లి పంచాయతీ ఆసాదివాండ్లపల్లెలో ఆదివారం బోరు వేయడంతో పుష్కలంగా నీళ్లు పడ్డాయి. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

అన్నదానం

వీరబల్లి, అక్టోబరు13: అన్నదానం మహాపుణ్యకార్యమని ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. విజయదశమి పురస్కరించుకుని మండల కేంద్రంలోని దుర్గమ్మ మందిరంలో అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజర య్యారు ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త సచ్చిదానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

బెదిరించినా, లంచం అడిగినా నేరుగా ఇంటికే..

- **వంట నూనెల విక్రయాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవు**
- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**


వంట నూనెల విక్రయ కౌంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 13: వ్యాపారులను బెదిరించిన, లంచం అడిగిన అధికారులను నేరుగా ఇంటికి పంపుతామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని గాంధీ బజారులో పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంటనూనెల విక్రయ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. బహిరంగ మార్కెట్‌లో పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామ న్నారు. ఈ ప్రభుత్వం వ్యాపారులతో అనుకూలంగా, స్నేహపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఎవరైనా బెదిరించినట్లయితే వ్యాపారులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యాపారులు కూడా ప్రజలతో మమేకమై నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. రాయచోటి నియోజకవర్గం లో గత ప్రభుత్వం లాగా లాలూచీ పడడం, బెదిరింపులు ఉండవన్నారు. మిల్లర్ల యజమానులు ప్రభుత్వ పరంగా, చట్టబద్ధంగా టాక్స్ చెల్లించ వచ్చునన్నారు. ఇక నుంచి ఎవరైనా అధికారులు, వ్యాపారులను ఇబ్బంది లకు గురిచేసినా, లంచం అడిగినా నేరుగా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెంకటేశ్వరాలయంలో పూజలు

సంబేపల్లె: ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలంటూ సంబేపల్లె మండలం అడవికమ్మపల్లెలోని వెంకటేశ్వరస్వామి గుడిలో శనివారం మంత్రి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాల న్నారు. గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లునరసారెడ్డి, కిల్లారి చిన్నప్పనాయుడు, కొండయ్య నాయుడు, రాజేందర్‌నాయుడుతో కలిసి అడవికమ్మపల్లి సమస్యలపై చర్చిం చారు. ఆలయ ప్రాంగణంలో ప్రజల సౌకర్యం టీటీడీ కల్యాణ మండపం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: నేడు మండలంలోని పందిళ్లపల్లి, కుర్నూతల, కస్తూరిరాజుగారి పల్లె, లక్కిరెడ్డిపల్లెల్లో జరగబోవు పల్లెపండుగ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వస్తున్నట్లు ఏవో గురుప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో జరుగు పల్లె పండుగ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరవుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధు లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా నాయకుడు చిన్నరెడ్డెన్న

రాయచోటిటౌన్, అక్టోబరు13: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతో పాటు, బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘం అన్నమయ్య జిల్లా నాయకుడు చిన్నరెడ్డెన్న ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాల ఆవరణలో అన్నమయ్య జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బీవీ రమణ ఆధ్వ ర్యంలో పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల మరణించి న పెన్షనర్లందరికీ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెన్షనర్లందరి కీ అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరించాలని, పెన్షనర్లందరికీ ఇప్పటి వరకు ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే పే రివిజన్ కమిషన్, పీఆర్‌సీ 2024ను ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని కోరా రు. కొత్తగా పదవీ విరమణ చేసిన పలువురిని సంఘ సభ్యులుగా చేర్చుకున్నారు. అనంతరం పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పీ. ఈశ్వర య్య మాట్లాడుతూ పెన్షనర్లందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ చేసి రూ.5 లక్షల వరకు నగదు రహిత చికిత్సలు పొందేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరూ ఈ సమావేశంలో పా ల్గొని తమ విలువైన అభిప్రాయాలను ప్రభు త్వం దృష్టికి తీసుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పెన్షన్ల సం ఘం నాయకులు వాకా రెడ్డికుమార్ తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి

- **ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న మల్లురఘునాథరెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు13: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీస్ మొత్తం ఉద్యోగులు దాచుకున్న డబ్బు నుంచి పీఎఫ్‌లోన్లు, ఏపీజీ ఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్, అర్జిత సెలవుల నగదు చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. బకాయిల కోసం ఉద్యోగులు ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. డీఏ, పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగారెడ్డి మాట్లాడుతూ మెడికల్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి బోధనకు పరిమితం చేయాలని తెలిపారు. బోధనేతర పనుల నిర్వహణ కోసం ప్రతి పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని తెలిపారు. పాఠశాలల నిర్వహణ కోసం ఈ విద్యా సంవత్సరం పాఠశాల నిర్వహణ గ్రాంటును విడుదల చేయాలన్నారు. అన్నమయ్య, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు మాట్లాడుతూ అర్జిత సెలవుల బకాయిల చెల్లింపులో ఏళ్ల తరబడి జాప్యం కారణంగా ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని, రెండేళ్ల నుంచి పెట్టిన అర్జిత సెలవులను రద్దు చేసి కొత్తగా అర్జిత సెలవులు పెట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. వెంటనే ప్రభుత్వం దీర్ఘకాలిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ ప్రకటన ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 117 జీవోను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళికుమార్, జిల్లా నాయకులు సుధాకర్, రామాంజులు, గోపీకృష్ణ, రెడ్డెయ్య, నాగరాజు, శివశంకర్, కృష్ణారెడ్డి, రమణయ్య, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర రవాణా మంత్రి పర్యటన వివరాలు

రాయచోటిటౌన్, అక్టోబరు13: పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం రాయచోటి నియోజకవర్గ పరిధిలో ని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు చిన్నమండెం మండలం పడమటికోన గ్రామం బలిజపల్లిలో, 9.30 కి గాలివీడు మండలం అరవీడు కస్పాలో, 10 గంటలకు గాలివీడు మండలం అరవీడు కస్పా హరిజనవాడలో, 10.30 గంటలకు గాలివీడుటౌన్ కుమ్మరపల్లిలో, 11 గంటలకు గాలివీడు టౌన్ నడంపల్లిలో, 11.30కి గాలివీడు మండలం గోరాన్‌చెరువులో, 12.30కి పూలికుంటలో 1 గంటకు లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లిలో 1.30 గంటలకు లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల వడ్డెపల్లిలో, 2 గంటలకు లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుగారిపల్లెలో సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేస్తారు. 2.30కి లక్కిరెడ్డిపల్లె మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని తిరుపతినాయుడు కాలనీలో 20వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మి వృద్ధాశ్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలియజేశారు.

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మురళి

నందలూరు, అక్టోబరు 13 : నందలూరు రైల్వేకేంద్రంలో ఆదివారం రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాగిరెడ్డిపల్లె రైల్వే క్వార్టర్స్‌లోని బ్రాంచి కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా మురళి, సెక్రటరిగా పులి నారాయణ, ట్రెజరర్‌గా మాడపూరి ఆదినారాయణ, గౌరవ సలహాదారుడిగా రామచంద్రయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఆలిండియా రైల్వే ఫెడరేషన్ మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) అనుబంధ సంస్థగా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ పని చేస్తుందన్నారు.

విజయానికి సంకేతం విజయదశమి

రాజంపేట, అక్టోబరు 13 : లోక కంటకులైన రాక్షసులను వధించి చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకుంటున్నామని తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు పర్యవేక్షణలో రాజంపేట పట్టణం మన్నూరులోని ఉదయగిరి ఎల్లమ్మతల్లి దేవాలయంలో శనివారం విజయదశమి విశిష్టతపై ఆయన ధార్మికోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలో తిష్టవేసిన కామ క్రోధ లోభ మోహ మద మత్సరములనే అరిషడ్వర్గాలతో పాటు అజ్ఞానాంధకారం, అహంకారం అనే రాక్షస ప్రవర్తులను తరిమివేయగలినప్పుడే నిజమైన విజయదశమి అని చెప్పారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 13: మండలంలోని మంగంపేట యూత్ స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో 5వ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచినవారికి ఎమ్మె ల్యే శ్రీధర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో గెలిచినవారికి మొదటి బహుమతి రూ.35 వేలు మంగంపేట పవర్‌స్టార్స్ గెలవగా, రన్నర్‌గా నిలిచిన హైదరాబాదు అరవింద్ బాయ్స్ జట్టుకు 20 వేల రూపాయలు, మూడో బహుమతి మాధవరంపోడు బాయ్స్ జట్టుకు 10 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ పార్టీ యువ నాయకులు ముక్కా విశాల్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, గునిపాటి చెన్నరాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగంపేట యూత్, గ్రామ ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

17 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 13: మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 45 మందికి పరీక్షలు నిర్వహించి 17 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 36 మందికి పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్రానిదే బాధ్యత

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 13: కామ్రేడ్ సాయిబాబా మరణం పీడిత ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. లక్కిరెడ్డిపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయిబాబా ఆరోగ్యం పూర్తిగా క్షీణించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దుర్మార్గ పద్ధతులే కారణ మన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే సాయిబాబాకు నిజ మైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె పీడీఎస్‌యూ మండల నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.

విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

వీరబల్లి, అక్టోబరు 13: నిధుల దుర్వినియోగంపై క్షేత్రస్థాయిలో విచారిస్తేనే వాస్త వాలు వెలుగులోకి వస్తాయని పలువురు టీడీపీ నాయకులు తెలిపారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తే కొంత మంది సర్పంచులకు ఉలికి పాటు ఎందుకని ప్రశ్నించారు. గ్రామాల్లో సర్పంచులు అభివృద్ధి చేస్తే అనందిస్తామే తప్ప అభివృద్ధిని అడ్డుకోమన్నారు. గ్రామాల అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుం దన్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు సహకరించి నిజాయితీ పరులుగా నిరూపించు కోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సురేంద్రారెడ్డి, అమరేశ్వర రాజు, మాజీ సర్పంచ్ వెంకట్రామరాజు, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రాజు, ఆంజనే యులురెడ్డి, జనసేన నాయకులు వెంకటేశ్, చలపతి, మైనార్టీ నాయకులు దస్తగిరి, నేతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన మారమ్మతల్లి

పుల్లంపేట, అక్టోబరు 13: మండల పరిధిలోని పాపక్కగారి పల్లెలో ఆదివారం మారెమ్మ కు పొంగళ్లు సమర్పించారు. పాప క్క గారిపల్లె, పొదలోపల్లెలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకా లు చేసి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాలతో శోభాయ మానంగా అలంకరించారు. అనంతరం ఆసాదులు అమ్మవారిని దీవిస్తూ చెప్పిన కథ అందరిని అలరించింది. ధర్మకర్త ఇండ్లూరి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సర్వమంగళాదేవి త్రిశూలం సమర్పణ


వెండి త్రిశూలం వితరణ చేస్తున్న దాతలు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 13: మండల కేంద్రంలోని సర్వ మంగళాదేవి సమేత రామలిం గేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి విజయదశమి సం దర్భంగా దిన్నెపాడు పంచా యతీ పర్వతరెడ్డిగారిపల్లెకు చెందిన రాయవరపు సుదర్శన్ బాబు, నాగజ్యోతి దంపతులు అమ్మవారికి రూ.45 వేలు విలువ గల త్రిశూలాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీహరిస్వామి, ఆలయ వ్యవస్థాపకుడు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, గొర్ల మోహన్ రెడ్డి, భూదేవమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండూరు రఘునాథరాజు, సూర్యుడునాయక్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.20,116 విరాళం


నగదును అందజేస్తున్న అజయ్‌రెడ్డి

సుండుపల్లె, అక్టోబరు13: మండల కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డ రాచపల్లి సమీపంలో నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మా ణానికి ఆర్ఆర్ ట్రేడర్స్ నిర్వాహకులు అజయ్ రెడ్డి రూ.20,116 నగదును అందజేసినట్లు గ్రామ స్తులు ఆదివారం తెలిపారు. ఆలయ నిర్మాణం తరతరాలు నిలిచిపోయేటట్టు పాలరాతితో నిర్మి స్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు రెడ్డెయ్యరాజు, గంగరాజు, టీడీపీ నాయకులు శాంతకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మృతి


బండ్ల కాంతమ్మ (ఫైల్ ఫొటో)

పెనగలూరు, అక్టోబరు 13 : మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బండ్ల కాంతమ్మ(93) వృద్ధాప్య సమస్యలతో శనివారం మృతిచెందారు. ఆదివారం ఉదయం కంబాలకుంటలోని ఆమె స్వగృహంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ సర్పంచ్ కాంతమ్మ మృత దేహానికి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంతమ్మ కుటుంబ సభ్యులు, ప్రిన్సిపల్ సెక్రటరి జీపీ రెడ్డయ్య, కుమారులు గొబ్బూరు జగదీష్‌కుమార్, భారత ఎగుమతుల మాజీ ఛైర్మన్ గొబ్బూరు కిషోర్‌కుమార్, మాజీ ఏఎస్పీ జీసీ రెడ్డయ్యలతో ఎమ్మెల్యే మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పుల్లంపేట, అక్టోబరు 13 : స్థానిక ఎస్‌బీవీడీ ఉన్నతపాఠశాలలో 1988-93 సంవత్స రంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం పుత్తనవారిపల్లెలోని కల్యాణమండపంలో చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకొన్నాయి. అందరూ కలిసి విందు ఏర్పాటు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారు, తమ బ్యాచ్‌లో మిగిలినవారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చారు. రెండేళ్ల క్రితం కలిసిన ఈబ్యాచ్ తిరిగి కుటుంబ సభ్యులతో కలిసి మరోసారి కలిసి జ్ఞాపకాలను పంచుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు.

చిత్తూరు నగరంలో ఉద్రిక్తత





చర్చి వీధిలో కొంతమేరకు కూల్చేసిన పాత భవనం, సీఐతో మాట్లాడుతున్న కటారి హేమలత, గుమికూడిన జనం

- చర్చివీధిలో ఓ పాత భవనాన్ని కూల్చబోతుండగా చెలరేగిన వివాదం
- పోలీసులు, అధికారుల రాకతో శాంతించిన రెండు వర్గాలు
- ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ

చిత్తూరు, అక్టోబరు 13: చిత్తూరు నగరంలోని చర్చి వీధిలో ఉన్న పాత భవనాన్ని ఓ స్వీట్ స్టాల్ యజమాని కూల్చడానికి యత్నించారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఎలా కూలుస్తారంటూ టూరిజం డైరెక్టర్ కటారి హేమలత పనులను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం చర్చి వీధిలోని తేజ స్వీట్ స్టాల్ యజమాని రవి తన స్టాల్‌కు ఎదురుగా ఉన్న పాత భవనాన్ని ఎక్స్‌కవేటర్‌తో పడగొట్టే పనిని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కటారి హేమలత తన అనుచరులతో అక్కడికి చేరుకుని, తమకు అగ్రిమెంట్ ఉందని పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఈ సమయంలో కొందరు ఆకతాయిలు వన్‌టౌన్ సీఐ జయరామయ్య పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు కూడా వచ్చి పోలీసులతో చర్చించారు. పరిస్థితి చేయి దాటకుండా చేసేందుకు డీఎస్పీ సాయినాథ్, ఆర్డీవో శ్రీనివాసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఈ భవనం విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా.. పనులెలా చేస్తారని హేమలత ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్‌సహా అన్నిరకాల అనుమతులు ఉండడంతోనే కూలగొట్టే పనులు చేపట్టానని స్వీట్ స్టాల్ యజమాని అధికారులకు వివరించారు. మరోవైపు సంఘటనా స్థలం వద్ద పెద్దఎత్తున జనం గుమికూడడంతో.. ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చర్చి వీధిని బ్లాక్ చేయడంతోపాటు పనులు ఆపేయించి, ఎక్స్‌కవేటర్‌ను పంపించేశారు. ఇరువర్గాల వారూ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు.

స్థల యజమానే మోసగించాడా?

చివరిగా జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో రెండువర్గాలూ సమావేశమయ్యాయి. పాండిచ్చేరికి చెందిన స్థల యజమాని ఒకరికి రిజిస్ట్రేషన్, మరొకరికి అగ్రిమెంటు చేసి మోసగించినట్లు గుర్తించారు. అతడిని పిలిపించి ఇరువర్గాలకు తగిన న్యాయం చేస్తామని ఎమ్మెల్యే సర్దుబాటు చేసినట్లు సమాచారం.

16న పీసీఆర్‌లో ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 13: చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి సయ్యద్ మౌల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన నాన్ మ్యాథ్స్ గ్రూపు (సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్)లో 75 శాతం విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం ఉందన్నారు. ఏడాదిలో మూడు నెలల శిక్షణ, తొమ్మిది నెలల ఇంటర్న్‌షిప్ అనంతరం హెచ్‌సీఎల్‌లో వార్షిక వేతనం రూ.1.70 లక్షల కింద ఉద్యోగం లభిస్తోందన్నారు. ఇతర వివరాలకు 63630 95030 నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

కారు, మినీ లారీ ఢీ : ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

బంగారుపాళ్యం, అక్టోబరు 13: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని దొరచెరువు సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన మల్లికార్జున్ రెడ్డి తన కుటుంబీకులతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనార్థం బయల్దేరారు. మార్గమధ్యంలోని మొగిలి ఘాట్‌లో చిత్తూరు వెళ్తున్న మినీ లారీని వెనుక వైపునుంచి వీరు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని మల్లికార్జున్‌రెడ్డి స్వల్పంగా, ప్రవల్లిక అనే చిన్నారికి తీవ్రంగా గాయపడడంతో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం వేలూరు నరువి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి దుర్మరణం



ఖాదర్‌బాషా మృతదేహం

గంగవరం, అక్టోబరు 13 : గంగవరం మండలం నాలుగురోడ్ల సర్కిల్ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన ఖాదర్‌బాషా కారులో నాలుగు రోడ్ల సర్కిల్ వద్దకు సొంతపని నిమిత్తం చేరుకున్నాడు. టీ తాగాలని బాలాజి భవన్ ఎదురుగా ఆపోజిట్ సైడ్‌లో కారు పార్క్ చేశాడు. టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా, బెంగళూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొనడంతో ఖాదర్‌బాషాకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలం చేరుకొని పరిశీలించగా, తలకు తీవ్రగాయాలై అప్పటికే మృతిచెందాడని 108 సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

జిల్లాలో మోస్తరు వాన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13: జిల్లాలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా.. రామకుప్పంలో 18.2, తవణంపల్లెలో 14.6, శాంతిపురంలో 7.4, పూతలపట్టులో 3.4, బంగారుపాళ్యంలో 2.2, వి.కోటలో 2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 15 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. మండలాల వారీగా.. శ్రీరంగరాజపురంలో 28.4, గుడిపాలలో 11.2, రామకుప్పంలో 10.2, తవణంపల్లెలో 8.8, పాలసముద్రంలో 8.2, సదుంలో 7.2, సోమలలో 6.8, గంగాధరనెల్లూరులో 6.4, పెనుమూరులో 5.8, యాదమరిలో 5, చిత్తూరులో 4.6, వి.కోటలో 3.6, శాంతిపురంలో 1.2, బంగారుపాళ్యంలో 1, పూతలపట్టులో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

వైభవంగా 'భాగ్ సవారి'



పొగడ చెట్టు వద్ద పూజలు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం 'భాగ్ సవారి' ఉత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. పురాణాల ప్రకారం.. స్వామి భక్తుడైన అనంతాళ్వారు భక్తిని పరీక్షించడానికి శ్రీదేవి సమేతంగా స్వామివారు అనంతాళ్వారు పూదోటకు మానవరూపంలో వెళతారు. తన పూదోటలో పూలు కోస్తున్న అమ్మవారిని అనంతాళ్వారు అశ్వత్థ వృక్షానికి బంధిస్తాడు. స్వామిని పట్టుకోబోగా అప్రదక్షిణ దిశలో ఆలయంలోకి పారిపోయి మాయమైపోతారు. తన భక్తిని పరీక్షించడానికి వచ్చింది స్వామివారేనని అనంతాళ్వారు గ్రహించి పశ్చాత్తాపపడతాడు. వెంటనే అమ్మవారిని బందీ నుంచి విముక్తురాలిని చేసి, పూలబుట్టలో కూర్చోబెట్టి స్వామి చెంతకు చేరుస్తారు. అతడి కోరిక మేరకు బ్రహ్మోత్సవాల మరుసటి రోజు అనంతాళ్వారు తోటకు అప్రదక్షణగా వచ్చి తిరిగి ఆలయంలోకి ప్రవేశిస్తానని స్వామివారు అభయమిచ్చారు. అందులో భాగంగా నిర్వహించే భాగ్‌సవారి ఉత్సవం కోసం ఆదివారం సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి స్వామివారు బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు అందుకున్నారు. అంతకుముందు అనంతాళ్వారు వంశీకులు నాళాయరా దివ్య ప్రబంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు హిమత్ గిరి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపట్టులో అపచారం

- గ్రామదేవత విగ్రహం చేతులు విరిచేసిన నిందితుడు
- ప్రభుత్వ టీచరుపై గ్రామస్తుల ఫిర్యాదు



విరిగిన గ్రామదేవత ఎల్లమ్మ చేయి

తిరుచానూరు, అక్టోబరు 13: తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులో గ్రామదేవత ఎల్లమ్మ విగ్రహం చేతులను విరగ్గొట్టారు. మరో విగ్రహాన్ని పెకలించారు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు ప్రభుత టీచరుపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణపట్టులో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎల్లమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పాతూరు, దిగువూరు, బ్రాహ్మణపట్టులో రోజూ ఊరేగించారు. ఊరేగింపు ముగిశాక ఆలయంలో ఉంచుతారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా రొంపిచర్లలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న.. పాతూరుకు చెందిన మోహన్‌రెడ్డి శనివారం వేకువజామున మద్యం మత్తులో ఆలయ గేటు తొలగించి, విగ్రహం రెండు చేతులు విరగ్గొట్టాడని, అక్కడే ప్రతిష్ఠించిన గ్రామదేవత విగ్రహాన్ని పెకలించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు తిరుచానూరు పోలీసులకూ సమాచారం ఇచ్చారు. దీంతో వారు మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో వదిలేసినట్లు తెలిసింది.

ఆర్టీసీకి బ్రహ్మోత్సవాల రాబడి రూ.8.7కోట్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: శ్రీవారి బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 10,77,273 మంది తిరుమలకు రాకపోకలు సాగించారు. ఆర్టీసీ గణాంకాల ప్రకారం గతంలో ఎన్నడూ ఇంత సంఖ్య నమోదు కాలేదు. 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 17,233 ట్రిప్పులతో 4,71,914మంది, తిరుమల నుంచి తిరుపతికి 17,295 ట్రిప్పులలో 6,05,359మంది ప్రయాణించారు. 31 ఆక్యుపెన్సీ రేషియోతో రికార్డు స్థాయిలో రూ.8.7కోట్లు సమకూరినట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

గంగమ్మ ఆలయానికి ఐఎస్‌వో సర్టిఫికెట్




అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, అక్టోబరు 13: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. కాగా బోయకొండ గంగమ్మ దేవస్థానం నాణ్యత, భద్రత, తదితరాలను గుర్తించి ఆలయానికి ఐసీఎల్ సంస్థ ఐఎస్‌వో సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు ఈవో తెలిపారు. ఆ సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి ఈ సర్టిఫికెట్‌ను అందించినట్లు చెప్పారు.

మణికంఠేశ్వర స్వామి ఆలయంలో

వైభవంగా శమీపూజ



మరగదాంబికకు ఊరేగింపు నిర్వహిస్తున్న ఉభయదారుడు మోహన్‌రెడ్డి, గ్రామస్తులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 13: కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి శమీ పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మణికంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న జమ్మిచెట్టుకు శమీ పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అగరంపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పుర వీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్

బురదలో కూరుకుపోయిన అంబులెన్స్

- ఇబ్బంది పడిన పేషెంట్




బురదలో కూరుకుపోయిన అంబులెన్స్, మరమ్మతుల కోసం మూసి ఉంచిన ప్రధాన గేటు

చిత్తూరు సిటీ, అక్టోబరు 13: చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వద్ద అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. దీంతో అందులో ఉన్న పేషెంట్ అర్ధగంటపాటు వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేటువద్ద ఉన్న క్యాటిల్ ట్రాప్ పాడవడంతో మరమ్మతులకోసం ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేశారు. తేనెబండకు వెళ్లే మార్గంలో ఈ గేటువుంది. కాగా ఇక్కడ సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో రోడ్డు బురదమయంగా తయారైంది. ఆదివారం పేషెంట్‌తో వచ్చిన అంబులెన్స్ ఇక్కడ ఇరుక్కుపోయింది. సుమారు అర్ధగంటపాటు అంబులెన్స్ ముందుకు, వెనుకకూ కదులుతుండటంతో లోపలున్న పేషెంట్ ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా తయారైంది. ఇక్కడ మొరం మట్టి (గట్టి మట్టి)తో రోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు, రోగుల బంధువులు కోరుతున్నారు.

చింతలగుంట కాలనీలో జల్లికట్టు

వెదురుకుప్పం, అక్టోబరు 13: వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ చింతలగుంట కాలనీలో ఆదివారం జల్లికట్టు జరిగింది. ముందస్తు సమాచారం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి గిత్తలను తీసుకొచ్చారు. వీక్షించడానికి జనం తరలివచ్చారు. అల్లెని ఏర్పాటు చేశారు. గిత్తలను అలంకరించి, కొమ్ములకు వివిధ రకాల పట్టీలను కట్టి అల్లివైపు వదిలారు. ఆసక్తి యువకులు గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. గిత్తల నుంచి పట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొడుతూ వెళ్లారు. గిత్తల కింద పడ్డ కొందరు స్వల్పగాయాలకు గురయ్యారు. తెలుగుదేశం పార్టీ జెండాలతో వెళ్లిన గిత్తలు ఆకర్షణీయంగా కనిపించాయి. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జనసందడి ఏర్పడింది.




టీడీపీ జెండాలతో పరుగులిడుతున్న గిత్తలు, అల్లిలో గిత్తలను నిలువరిస్తున్న యువకులు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 'డీఎస్సీ' ఉచిత శిక్షణ

చిత్తూరు, అక్టోబరు 13: డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగిన అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు ఉండాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు www.jnanabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్టు ఉంటుందన్నారు. మెరిట్ జాబితా ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతి సదుపాయాన్ని ప్రభుత్వమే కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారం పేరుతో కుచ్చుటోపి

- రూ.7లక్షలు తీసుకుని ఉడాయించిన ముఠా

గంగవరం, అక్టోబరు 13: బంగారం పేరుతో నమ్మించి రూ.7లక్షలు తీసుకొని ఓ ముఠా ఉడాయించిన ఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలకుప్పం గ్రామానికి చెందిన శేషయ్యకు కొందరు పరిచయమయ్యారు. మాటామాటా కలుపుతూ తమకు బంగారు నిధులు దొరికాయని, ఎవరైనా ఉంటే తక్కువ ధరకు అమ్మేస్తామని నమ్మించారు. తనకే బంగారు కావాలంటూ శేషయ్య వారికి చెప్పడంతో, రెండు ఒరిజినల్ బంగారు నాణేలను తీసుకొచ్చి ఇచ్చారు. శేషయ్య నాణేలను తీసుకొని ఆచారి వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా, నిజమైన బంగారం అని తేలింది. దీంతో అదృష్టం కలిసివచ్చిందని సంబరపడి, తన దగ్గర రూ.7 లక్షలు ఉన్నాయని, ఈ డబ్బుకు సరిపడా బంగారు తీసుకురమ్మని సూచించారు. దీంతో శనివారం ఆ ముఠా సభ్యులు నలుగురు శేషయ్య ఇంటి వద్దకు వచ్చి రూ.7 లక్షలు తీసుకొని, బంగారు నాణేలు కారులో ఉన్నాయని, కారు రోడ్డు పక్కన పెట్టి వచ్చామని, ఇప్పుడే కారులో ఉన్న బంగారం తీసుకొచ్చి మీకు ఇస్తాము ఇక్కడే ఉండండి అని నమ్మించారు. డబ్బుతీసుకుపోయిన ముఠా సభ్యులు ఎంతసేపటికి నాణేలు తీసుకొని రాకపోవడంతో, శేషయ్యకు అనుమానం వచ్చి రోడ్డువద్దకెళ్లి చూడగా కారు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మోసపోయామని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

లారీ టైరు పేలి వ్యాపించిన మంటలు



లారీ టైరు పేలడంతో మంటలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 13: లారీ టైరు పేలడంతో మంటలు వ్యాపించి లారీ పాక్షికంగా దగ్ధమైన ఘటన ఆదివారం పుంగనూరు వద్ద చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు .... పుంగనూరు భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద మదనపల్లె నుంచి తమిళనాడు గుడియాత్తంకు కోళ్ల ఆహార పదార్థాలను తీసుకెళుతున్న లారీ వెనుక టైరు పేలి మంటలు రావడంతో గుర్తించిన డ్రైవర్ లారీని పక్కన నిలిపాడు. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. వెనుక ఎడమవైపు నాలుగుటైర్లు, లారీ బాడీ, ఫీడు పాక్షికంగా కాలిపోవడంతో దాదాపు రూ. 3లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు



బంగారు కిరీటంలో మదనపల్లె గంగమ్మ


రాజరాజేశ్వరిగా పీలేరు మోడల్ కాలనీ యల్లమ్మ



వారాహీ అలంకరణలో పీలేరు వాసవీ అమ్మవారు


బంగారు చీర అలంకరణలో అమ్మవారు


:రాజరాజేశ్వరి దేవిగా రెడ్డెమ్మ తల్లి, గుర్రంకొండ


ములకలచెరువులో అలంకరణలో అమ్మవారు


విశేషాలంకరణలో చౌడేశ్వరీదేవి


ధనలక్ష్మీ అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి

మదనపల్లెఅర్బన్/తంబళ్లపల్లె/పీలేరు, అక్టోబరు 13: మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో విజయదశమి వేడుకలను శని వారం అంగరంగ వైభవంగా వైభవంగా నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని పలుఆలయాల్లో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిం చారు. కోర్టులో గంగమ్మ ఆలయంలో ఆలయకమిటీ సభ్యులు అమ్మ వారినికి బంగారు కిరీటం అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిం చారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తోపాటు టీడీపీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్, జేసీబీ వేణు, కమలమరికృష్ణ, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, రామిశెట్టి రత్నమయ్య, పవన్ కుమార్‌లు కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సకాలు ఎమ్మె ల్యే చేతుల మీదుగా అందజేశారు. ఆలయంలో జ్యోతులను ఊరేగింపు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరాదేవి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతాసతీష్, కార్యదర్శి సూరేగిరిధర్‌లు ఉదభయదారులు కలిసి పూర్ణహుతిని చండీహోమంలో సమర్పించారు. ఉదయాన్నే మహిళలు ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంల నుంచి గంగను తెచ్చి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సాయం త్రం ధనలక్ష్మీ అలంకరణలో పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే షాజహా న్‌బాషా కన్యకాపరమేశ్వరీదేవిని దర్శించుకున్నారు. దేవతాన గర్‌లో రాజరాజేశ్వరీ ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. మండ లం లోని మడికయ్యల శివాలయంలో చండీ హోమం నిర్వహించారు. పీలే రు పట్టణంలోని అమ్మవారి ఆలయాలో శరన్నవరాత్రి ఉత్సవాలు శని, ఆదివారాల్లో వైభవంగా నిర్వహించారు. పీలేరు గ్రామదేవత రౌద్రాల అంకాళమ్మ, మోడల్ కాలనీ వద్దనున్న యల్లమ్మ తల్లి రాజరా జేశ్వరి అలంకారంలో, నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మ వారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహానికి విజ య లక్ష్మి అలంకరణతోపాటు ఆలయంలోని మూలవిరాట్టుకు బంగారు, చీర, కెంపులహారంతో అత్యంత సుందరంగా అలంకరించారు. రౌద్రాల అంకాళమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహిం చారు. పట్టణంలోని కాశీ విశాలాక్షి సమేత శివాలయం, తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరి ఆలయం, అగ్రహారం అష్టలక్ష్మి సమేత నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తంబళ్లప ల్లె మండలంలో విజయదశమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయం, రామాలయం, శేష సాయిబాబా ఆలయాల్లో అమ్మవారిని కొలువు దీర్చి విశేషంగా అలంకరణలు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో కొలువుదీరిన పార్వతీ దేవి అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శేష సాయి బాబా ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిమ్మనపల్లిలో: విజయదశమి సందర్భంగా నిమ్మనపల్లి పంచాయతి పెద్దమాదిగపల్లి వెలసిన మాతమ్మతల్లి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్థిని .అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవ రాత్రులు చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయాని వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ములకలచెరువులో: మండలంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని సోంపాళ్యంలో వెలసిన పురాతన మత్స్యేట చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు పూజలు చేశారు. ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో వెలసిన వాసవీ కన్నకాపరమేశ్వరి దేవి అమ్మవారు వెండి కవచం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులను కరుణిం చారు. అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అర్చన, పం చామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అలాగే గుర్రంకొండ పోలే రమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులను కటాక్షించారు. ఆల యానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయా ఆల యాల వద్ద అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం యోగభోగేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలకు గాజులు పంపిణీ చేశారు. అనం తరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ ఆవరణలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త మార్పూరి సుధాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు టీ, కృష్ణప్పనాయుడు, ఎంఎస్‌ఆర్ టమోటా మండియాజ మాని డి.వెంకటశేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దసరా పండుగను మండల ప్రజలు వేడుకగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి వారు తమ జీవనాధారమైన పరికరాలు, పనిముట్లకు పూజలు చేశారు. చౌడేశ్వరిదేవి ఆలయాలలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. పలువురు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కు లు తీర్చుకొన్నారు.

కురబలకోటలో: మండలంలో విజయదశమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండలంలోని అంగళ్ళు, కురబలకోట, పిచ్చలవాండ్లప ల్లె, కమతంపల్లె, మొలకవారిపల్లె తదితర గ్రామాల్లోని అమ్మవారిని ప్రత్యేకంగా వేడుకలను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా శనివారం విజ యదశమి పండుగ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. మండలం లోని గండబోయనపల్లె సత్యమ్మతల్లి ఆలయంలో అమ్మవారు రాజరాజే శ్వరిదేవిగాను, కోనేటివీధి శివాలయంలో కామేశ్వరిదేవిగా, కన్యకాపరమే శ్వరి ఆలయంలో వాసవాంబదేవి అలంకరణలు, పుష్పయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో సత్యమ్మతల్లి ఆలయ చైర్మన్ పులి సత్యారెడ్డి, ఆలయాల ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


మదనపల్లె మడికయ్యల శివాలయంల చండీ హోమంలో పాల్గొన్న టీడీపీ సమన్వయకర్త మార్పూరి సుధాకర్‌నాయుడు


వాల్మీకిపురంలో ఊరేగుతున్న నల్లవీరగంగాభవానీ అమ్మవారు


మదనపల్లె దుర్గమ్మతల్లి

వైభవంగా దుర్గమ్మల నిమజ్జనం


రూ.2,16,000లకు దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో భక్తులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు13: పట్టణంలో విజయదశమి పురస్కరించుకుని పలు వీధు లో దుర్గమ్మను ఏర్పాటు చేసి 9 రోజులు పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆది వారం సాయంత్రం నిమజ్జనం చేశారు. టి. నాగిరెడ్డివీధిలో దుర్గామాతకు విశేషంగా పూజలు నిర్వహించి అనంతరం ఆదివారం సాయంత్రం ఊరేగింపుగా తరలి వెళ్లి తట్టివా రిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే కోటవీధిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వ ర్యంలో దుర్గామాతను ఏర్పాటు చేసి విశేషంగా పూజలు నిర్వహించి ఆదివారం అంగ రంగ వైభవంగా అమ్మవారికి పూజలు చేసి బళ్లారిడ్రమ్స్ నడుమ విజయదర్గమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి బైపాస్‌లోని స్వామి చెరువులో నిమజ్జనం చేశారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ తులసీరామకృష్ణ, విశ్వబ్రాహ్మణులు, యువత పాల్గొన్నారు. అలాగే స్థానిక కమ్మగడ్డవీధిలోని నాదేళ్ల అరుణ్ తేజ్ ఆధ్వర్యంలో దుర్గమ్మను ప్రతిష్టించి విశేషం గా పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు యువకులు లలిత్, సాయి, విఘ్నేష్, నిఖిల్, మణి, నానిలు దుర్గమ్మకు పూజలు, చేశారు. ఆదివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇసుకనూతనపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు లడ్డూ వేలం వేయగా కరుణాకర్, సాయిచంద్, సందీప్‌లు రూ.2,16000లకు సొంతం చేసుకున్నారు.

ఉలవల గంగమ్మకు వెండి కిరీటం వితరణ


వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

పీలేరు, అక్టోబరు 13: పీలేరు మండలం తలపు ల వద్దనున్న ఉలవల గంగమ్మకు పీలేరు పట్ట ణం కడప రోడ్డుకు చెందిన తువ్వపల్లె రెడ్డమ్మ, తువ్వపల్లె సురేంద్ర రెడ్డి దంపతులు ఆదివారం వెండి కిరీటాన్ని వితరణగా అందజేశారు. అమ్మవారికి మొక్కుకున్న ఆ దంపతులు తమ మొక్కు తీరడంతో అమ్మవారికి కిరీటం బహూ కరించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పవిత్రోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

వాల్మీకిపురం, అక్టోబరు 13: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పవిత్రోత్సవాలకు సోమవా రం సాయంత్రం అంకురార్పణతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. 15న మంగళవారం ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్రల ప్రతిష్ట, స్నపన తిరుమంజనం, 16న బుధవారం ఉదయం ప్రత్యేక పూజలతో పవిత్రల సమర్పణ, 17న గురువారం యాగశాల వైదిక కైంకర్యాలు, మహాపూర్ణాహుతి, కుంభ సంప్రోక్షణ, పవిత్రల వితరణ, చక్రస్నానం, తిరువీధి ఉత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, అక్టోబరు 13: ములకలచెరువులోని కదిరి రోడ్డులో నివాసమున్న ఎస్.బాషాసాహెబ్(72) లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేర కు...సొంత పనుల నిమిత్తం బస్టాండుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా కదిరి వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లెకు తరలించి అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతి రూయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

పీలేరు, అక్టోబరు 13: పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ ఠాణావడ్డిపల్లె వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,850లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆదరిస్తున్న కార్యకర్తలను మరువం

● అనుచరుల పరామర్శలో నల్లారి సోదరులు మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి


వాల్మీకిపురం వడ్డిపల్లెలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి


ప్యారంపల్లెలో అక్కుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 13: ఆదరిస్తున్న నాయకులు, కార్య కర్తలను ఎన్నటికీ మరువబోమని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి లు పేర్కొన్నారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు గా నల్లారి సోదరులు వాల్మీకిపురం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని వడ్డిపల్లెలో టీడీపీ సీనియర్ కార్యకర్త చిన్న రామన్న, ప్యారంపల్లెకు చెందిన అక్కుల్‌రెడ్డి ఇటీవల కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సీఎం, ఎమ్మెల్యేలు గ్రామాల కు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పట్టణానికి చెందిన చింతల బ్రహ్మపుత్రారెడ్డి, కూరపర్తికి చెందిన శంకర, కువైట్ సయ్యద్‌బాషాల నివాసాలకు చేరు కుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భం గా నల్లారి సోదరులు మాట్లాడుతూ తమ తండ్రి నల్లారి అమరనాథరెడ్డి కాలం నుంచి తమను ఆదరిస్తున్న నాయకు లు, కార్యకర్తలు యోగక్షేమాలు ఎన్నటికీ విస్మరించమన్నారు. ఏ కష్టమొచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ గ్రామాన నల్లారి సోదరులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. వడ్డిపల్లెలో గ్రామ సమస్యలపై మహిళలు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి విన్నవిం చగా అధికారులతో చర్చించి తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమాలలో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తన యుడు నిఖిలేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రకుమా ర్‌రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్, నాయకులు కృష్ణా రెడ్డి, గాంధీపేట రమణ, పీవీ నారాయణ, చంద్రమౌళి, రమే ష్, బొక్కసం బ్రదర్స్, రాజేంద్రాచారి, శేషాద్రిరెడ్డి, ద్వారకనా థరెడ్డి, రఘురామిరెడ్డి, మురళి, మైనార్టీ నాయకులు సయ్య ద్‌బాషా, మస్కట్ మస్తాన్, జంషీద్, సైదు, కాలనీ రమేష్, ఖాద్రి, వీరంరెడ్డి, గంగులప్ప, రామాంజులురెడ్డి, గాంధీపేట రెడ్డి, రెడ్డిరామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలంలో పలు గ్రామాల కు చెందిన అనుచరుల కుటుంబాలను ఆదివారం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలు పరామర్శించారు. ఇందులో భాగంగా టి.పసలవాండ్లపల్లె మాజీ సర్పంచ్ దొరస్వామినాయుడు కుమారుడు రామాంజులు వివాహానికి హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు. అనంతరం చెర్లోపల్లె పంచాయితీ పరిధిలోని సూరప్పగారిపల్లెకు చెందిన అనుచరుల కుటుం బాలను పరామర్శించారు.

చెన్నైలో కుటాగులోళ్లపల్లె మహిళ ఆత్మహత్య

ములకలచెరువు, అక్టోబరు 13: ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ కుటాగులోళ్లపల్లెకు చెందిన గీత(24) అనే మహిళ తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఆత్మ హత్యకు పాల్పడింది. గ్రామస్థుల కథనం మేరకు...గ్రామా నికి చెందిన ప్రకాష్‌తో పెద్దమండ్యం మండలం పాపేప ల్లెకు చెందిన గీతకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఏడాది కుమారుడు ఉన్నాడు. ప్రకాష్ చెన్నైలోని ఓ ట్రాన్స్ పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతని కుటుంబం చెన్నై లోనే నివాసముంటోంది. ఈ క్రమంలో గీత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ద్విచక్రవాహనాలు ఢీ .. ఇద్దరికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, అక్టోబరు 13: బి.కొత్తకోట పట్టణ శివారు బెంగళూరురోడ్డులోని పెట్రోలు బంకు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి. పీటీయం మండలం ముంతగోగులపల్లెకు చెందిన శంకర(50) ఆదివారం బి.కొత్తకోట సంతలో వ్యా పారం ముగించుకొని స్వగ్రామానికి వెళుతుండగా శంక రాపురం వైపునుంచి బి.కొత్తకోటవైపు మరో ద్విచక్రవా హనంలో వస్తున్న మధు(45) అనే వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో ఇరువురికీ తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరినీ బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం 108లో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలిచారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

రామసముద్రం, అక్టోబరు 13: రామసముద్రం సమీపంలో గుట్టలో అనుమానాస్పదస్థితిలో రెడ్డిశేఖర్(25)అనే యువకు డు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు కాటేవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ ఆదివారం ఉదయం నారిగానిపల్లె సమీపంలోని గుట్టలో శవమై కనిపించాడు. కొడుకు మరణవార్త విన్న చంద్రప్ప దిగ్భ్రాంతికి గురయ్యాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ రమేష్, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని రెడ్డిశేఖర్ మృతిపై విచారించారు. అనంతరం శవపరీక్ష కోసం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వలసపల్లె క్వారీలో కార్మికుడు మృతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13: మండలంలోని వలసపల్లె పంచాయతీలోని క్వారీలో శేషాద్రి (48) అనే కార్మికుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపా రు. తమిళనాడు రాష్ట్రం, కృష్ణగిరి, ఆర్కార్డుకు చెందిన శేషా ద్రి రెండేళ్లుగా క్వారీలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. శని వారం అనారోగ్యంతో క్వారీలోనే చనిపోయాడు. పోస్టుమా ర్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనం తరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 13:మదనపల్లె మండలం, కాట్లాటపల్లెకు చెందిన రామచంద్ర (56) ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయ పడ్డాడని తాలుకా ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. అనం తరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పల్లె పండుగను విజయవంతం చేయండి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, అక్టోబరు 1: పల్లె పం డుగను విజయవంతం చేయాలని ఎమ్మె ల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. ఆది వారం రామసముద్రం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ సోమవారం నుంచి రాష్ట్ర నాయక త్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పల్లె పండుగను కూటమి నాయకులందరం కలిసి నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయి లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి వీలుగా గ్రామాల నుంచి నాయకులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిస్థితి చాలా దయనీయంగా ఉందతన్నారు. మున్సిపాలిటీ జనరల్ కలెక్షన్లు వస్తే నేరుగా రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోతుంద న్నారు. పేదలకు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు కేటాయించాలరన్నారు. రామసము ద్రం మండలంలో రెవెన్యూ సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. కార్యక్రమం లో నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, షంషీర్, దారం అనిత, మార్పూరు నాగార్జునబాబు, మోడెం సిద్దప్ప, మాజీ జడ్పీటీసీ శివశంకర, మాజీ సర్పంచ్ తిప్పన్న పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

● నియోజవర్గంలో 15 మద్యం దుకాణాలకు 379 దరఖాస్తులు
● నేడు లాటరీ పద్ధతి ద్వారా దుకాణాల కేటాయింపు

ములకలచెరువు, అక్టోబరు 13: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మ ద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. మొత్తం 15 మద్యం దుకాణాలకు 379 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.7.58 కోట్లు ఆదాయం వచ్చింది. నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మం డలాలు ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. బి.కొత్తకోట, కురబలకోట మండలాలు మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. అత్యధికంగా బి.కొత్తకోట మం డలంలో మూడు దుకాణాలకు 110 దరఖాస్తులు, ములకలచెరువు మండలంలో మూడు దుకాణాలకు 77, కురబలకోట మండలంలో మూడు దుకాణాలకు 72, తంబళ్లపల్లె మండలంలో రెండు దుకాణాలకు 40, పెద్దమండ్యం మండలంలో రెండు దుకాణాలకు 40, పెద్దతిప్పసముద్రం మండలంలో రెండు 40 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రమైన రాయచోటిలో సోమవారం లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయింపు ప్రక్రియ జరగనుంది.

బలమైన పునాదితోనే లక్ష్యాన్ని చేరగలం


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, అక్టోబరు13: లక్ష్యాన్ని నేరవేర్చుకునే క్రమంలో పునాది చాలా బ లంగా ఉండాలని హైదరాబాదుకు చెందిన ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ ఆఫీసర్ యాద గిరి పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె డివిజన్ కురుబ సంఘం ఆధ్వర్యంలో విద్య లో ప్రతిభ సాధించిన కురుబ కులస్థుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుబ సామాజికవర్గంలో చదువు పై మక్కువ పెరగడంతో సామాజిక వర్గం నుంచి కూడా ఉన్నత పదవులను అధిరో హిస్తుండడం శుభ పరిణామన్నారు. అనంతరం ప్రతిభ కనపర్చిన కురుబ సామాజిక వర్గం విద్యార్థులకు అవార్డులు ఇచ్చి మెమెంటోతో దుశ్శాలువలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఫోర్స్ రిటైర్డ్ గ్రూపు కెప్టెన్ కె. పరంధామ గౌడ్, డాక్టర్ ఆర్ వెంకటరామయ్య, వై.హరికుమార్, మదనపల్లెడివిజన్ కురబ సంఘం అధ్యక్షకార్యదర్శులు ఆర్‌కే శ్రీనివాసు లు. మర్రిపాటి రమేష్, బత్తిని రెడ్డెప్ప, కప్పల నాగరాజ, జె. రకుద్రయ్య, దండురామాం జులు, బివి రమణ,గుడే శ్రీనివాసులు, మేజారి సదాశివ పాల్గొన్నారు.

ఘనంగా విజయభారతి హైస్కూల్ సేతు జన్మదినవేడుకలు


సేతుకు గజమాలతో జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న సర్పంచ్ చలపతి, పూర్వవిద్యార్థులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 13: మదనపల్లె పట్టణం సొసైటీకాలనీ లో విజయభారతి హైస్కూల్ కర స్పాండెంట్ ఎన్.సేతు జన్మదినవేడు కలను పూర్వవిద్యార్థులు, పురప్ర ముఖులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక విజయభారతి హైస్కూల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు సేతును తీసు కొచ్చిన పూర్వవిద్యార్థులు గజమాల లు వేసి, పుష్పగుచ్చాలు అందించి, రచనలతో కూడిన ఫొటోఫ్రేమ్ లను బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, టీడీపీ నేత సీడు మల్లికార్జుననాయుడు, సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఇ.వెంకట రెడ్డి, కురవంక సర్పం చ్ చిప్పిలి చలపతి, మీడియా ప్రముఖులు సేతును ఘనంగా సన్మానించి, జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.

హమాలీలకు దసరా కానుకల పంపిణీ


మహిళా హమాలీలకు దసరా కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 13: దసరా పండుగ పురస్కరించుకు ని స్థానిక టమోటా యార్డులో ఎంఆర్‌ఎం టమోటా మండీ యజమాని, టీడీపీ నియోజక వర్గ బీసీ విభాగం అధ్యక్షుడు ఎం.నాగయ్య ఆధ్వర్యంలో మహి ళా హమాలీలకు చీరలు పంపి ణీ చేశారు. శనివారం దసరా పండుగ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా 200 మంది హమాలీలకు కొత్త చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్, ఖాసీం, చలపతి, రామ్మూ ర్తి, లక్ష్మీపతి, బాలహరి పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసీ బస్టాండు



బస్సుల కోసం పీలేరు ఆర్టీసీ బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

పీలేరు, అక్టోబరు 13: దసరా సెలువుల ముగియడంతో కాలేజీలు, ఉద్యోగాల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం పీలేరు బస్టాండు కిటకిటలాడింది. పండుగ సెలవుల కోసం ఇళ్లకు వచ్చిన పిల్లలను తిరిగి హాస్టళ్లకు చేర్చేందుకు తల్లిదండ్రులు, ఉద్యోగాలు చేసుకునే పట్టణాలకు వెళ్లేందుకు ఉద్యో గులు, పని చేసేకునే ప్రాంతాలకు బయలుదేరిన కార్మికులతో పీలేరు నుంచి తిరుపతి, చిత్తూరు, రాయచోటి, మదనపల్లె వెళ్లే బస్సులు నిండిపోయాయి. ప్రయాణికుల రద్దీని తగినట్లుగా స్థానిక అధికారులను బస్సులను సర్దుబాటు చేసినప్పటికీ తమ గమ్యం చేరేం దుకు చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

సందర్శకులతో హార్సిలీహిల్స్ సందడి

బి.కొత్తకోట, అక్టోబరు 13: ప్రముఖపర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఆదివారం పర్యా టకులతో సందడిగా మారింది. దసరా సెలవులతో పాటు ఆదివారం కావడంతో బెంగ ళూరు లాంటి సుదూరప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కుటుంబీకులు, పిల్లలతో కొందరు, ఫొటోషూట్‌లకోసం వచ్చిన నూతనజంటలతో హిల్స్ కిక్కిరిసింది. రద్దీకి తగిన ఏర్పాట్లు టూరిజం అధికారులు చేప ట్టారు. మరోవైపు ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లు, దిగువనుంచి హిల్స్‌పైకి పర్యాటకులను చేరవేసే వాహనాలు పర్యాటకులకు తోడ్పడ్డాయి. బి.కొత్తకోట పోలీసులు గస్తీ నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

కురబలకోట, అక్టోబరు 13: ద్విచక్రవాహనంలో వెళుతున్న యువకుడు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో తీవ్రగాయాలైన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివ రాలిలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం శేషప్ప తోటకు చెందిన కిశోర్(32) తన ద్విచక్రవా హనంలో బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలోని అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది, గాయపడ్డ ఆయనను 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరి స్థితి విషమించడంతో బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముది వేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.